క్లుప్తంగా

కార్గో ఎయిర్ పోర్ట్‌కు వ్యతిరేకంగా నిరసన



పెద్ద బిడిమిలో ప్రచారం చేస్తున్న దృశ్యం

మందస: పెద్ద బిడిమి గ్రామంలో కార్గో ఎయిర్ పోర్ట్ వద్దంటూ వ్యతిరేఖ పోరాట సమితి, వామపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం చేశారు. ఇదే గ్రామంలో శనివారం కళాజాతా నిర్వహించనున్నట్టు చెప్పారు. కళాజాతా ద్వారా మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలోని సుమారు 16 బాధిత గ్రామాల ప్రజలను చైతన్య పర్చుతున్నట్టు సమితి సభ్యులు తెలిపారు. ప్రభుత్వ ప్రతిపాదత కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణ పనులను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ, ప్రజలను పాటలతో చైతన్య పరుస్తూ కాలి నడకతో కళాజాత కార్యక్రమం నిర్వహించనున్నారు.

నష్టపరిహారం ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

కంచిలి: తలతంపర పంచాయతీ పరిధి చిల్లపుట్టుగ గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన మూడు కుంటుంబాలకు ప్రభుత్వం నష్ట పరిహారం ఇప్పించాలని సీడాప్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శ్రీకాకుళంలోని తన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జగదీశ్వర ఆలయ పునఃప్రతిష్ట



పూజల్లో చైర్‌పర్సన్ పిరియా విజయ

కవిటి: మండలంలోని జగతి గ్రామంలో వెలసిన జగదీశ్వర ఆలయంలో నవగ్రహ మండపం, పానుమట్టం, ధ్వజస్తంభ పునఃప్రతిష్ట ఉత్సవాలు గడచిన రెండు రోజులుగా వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం కొత్త విగ్రహాల క్షీరాధివాసం, పంచామృతాది విశేషద్రవ్య అధివాసం, పంచ శయ్యాధివాసం, మండప ఆరాధనలు, హోమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేడుకల్లో శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు లోకకల్యాణార్థం శాంతి హోమం వైభవంగా సాగింది.

చంద్రశేఖరస్వామి ఆలయ ప్రతిష్ట



పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ అమీన్‌సాహెబ్‌పేటలో ఉమాసహిత చంద్రశేఖరస్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. గ్రామకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సాధారణ సమావేశాన్ని శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు శుక్రవారం తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ట్యాబ్‌ల చదువు అటకెక్కింది

మా పాప ప్రస్తుతం 10వ తరగతిలోకి, బాబు ఏడవ తరగతిలోకి వెళ్లనున్నారు. కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాం. గతంలో మా పాప 8వ తరగతిలో ఉన్నప్పుడు ఇంగ్లిష్‌లో చదివేది. ట్యాబ్‌లు ఇవ్వడంతో మా అబ్బాయికి కూడా ఇంగ్లిష్‌లో పాఠాలు చెప్పేది. ఏడాది నుంచి ట్యాబ్‌లో చదువుల్లేవు. గతంలో ప్రతీ ఏడాది అమ్మ ఒడి వచ్చేది. ఇప్పుడు ఇంత వరకు అమ్మకు వందనం రాలేదు.

– తుంబలో బెహరా, అరకబద్ర, ఇచ్ఛాపురం మండలం



ఒక్క పథకమూ అందడం లేదు



నాకు ఇద్దరు కుమారులు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఇంజినీరింగ్ చదువుతున్న పెద్ద కుమారుడుకు విద్యా దీవెన రూ. 30 వేలు వచ్చింది. చిన్న కుమారుడు వరుసగా అమ్మఒడి పథకం అందుకున్నాడు. జగన్ ఐదేళ్ల పాలనలో దాదాపు దాదాపు రూ.90 వేలు వరకు లబ్ది పొందాం. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఒక్క పైసా కూడా మంజూరు కాలేదు.

– డి.ఢిల్లీరావు, అమలపాడు, వజ్రపుకొత్తూరు మండలం

పాఠశాలల రూపు రేఖలు మార్చిన జగన్



కార్పొరేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఘనత గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు ఎంతో దీన స్థితిలో ఉండేవి. జగన్‌మోహన్‌రెడ్డి రూపకల్పన చేసిన నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలలు అద్భుతంగా మారాయి.

–ఎం.గణపతిరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, మోదుగువలస, టెక్కలి మండలం.

నాడు-నేడు పనులపై వివక్ష తగదు



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధే ధ్యేయంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నాడు- నేడు పథకం అద్భుతమైనది. దీన్ని కొనసాగించ కుండా కూటమి ప్రభుత్వం వివక్ష చూపడం తగదు. వెంటనే అసంపూర్ణంగా ఉన్న పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలి.

–బలగ డొంబురు, ఎస్సీ సంక్షేమ సంఘం నేత, కవిటి మండలం

పాఠశాలల రూపురేఖల్ని మార్చేశారు..



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 'నాడు–నేడు' పథకం ద్వారా పాఠశాలలకు అవసరమైన అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించారు. కార్పొరేట్‌కు దీటుగా సర్కార్ పాఠశాలలను తీర్చిదిద్దారు. విద్యార్థులకు మంచినీటి కోసం ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లను సమకూర్చారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పాఠశాలల రూపురేలను మార్చేశారు. ఈ కారణంగానే గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుత సర్కార్ హయాంలో ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. –చాట్ల తిరుపతి, ఇచ్ఛాపురం

కూటమి సర్కార్‌లో పాఠశాలలు మూతబడుతున్నాయి



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో పాఠశాలలు అన్నివిధాలుగా అభివృద్ధికి నోచుకున్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో విలీనం పేరుతో పాఠశాలలు మూతబడుతున్నాయి. గత సంవత్సర కాలంగా పాఠశాలల అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం వెచ్చించలేదు. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనంగా పేరు మార్చినప్పటికీ తల్లుల ఖాతాల్లో గత ఏడాది నగదు జమ కాలేదు.

– కోట రాజు, పేరెంట్స్ కమిటీ మెంబర్, బెంకిలి ప్రాథమిక పాఠశాల

నాడు సగర్వంగా నిలబడింది..!

- సర్కార్ బడులకు కూటమి దెబ్బ
- నిలిచిపోయిన పాఠశాలల భవనాల నిర్మాణం
- విద్యార్థుల దరిచేరని సంక్షేమ పథకాలు

విద్యపై కూటమి సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవరిస్తోందనే విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మనబడి 'నాడు–నేడు' పథకంతో కార్పొరేట్‌స్థాయికి దీటుగా..సగర్వంగా నిలబడిన సర్కార్ బడులు ప్రస్తుతం ఉనికిని కోల్పోయే పరిస్థితి నెలకుంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యావిధానంలో తీసుకొచ్చిన విప్లవాత్మకమైన మార్పులు ఎంతోమంది పిల్లల్లో కొత్త వెలుగును తీసుకొచ్చాయి. పాఠశాలలు, కళాశాలలకు నూతన భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి తదితర పథకాలు విద్యార్థుల చదువులో కీలకంగా మారాయి. పాఠశాలలు తెరిచే రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను అందజేసేవారు. కూటమి సర్కార్ వచ్చిన తరువాత ఈ పథకాలన్నీ మూలకు చేరాయి. వివిధ కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన నాడు–నేడు పనులను పునః ప్రారంభించలేదు. చంద్రన్న ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి ఏడాది కావస్తున్నా ఒక్కసారి కూడా పిల్లలకు అమ్మఒడి ఇవ్వలేదు. వివిధ కారణాలతో సర్దుబాటు పేరుతో ఉన్న పాఠశాలలను మూసేయాలని చూస్తున్నారు. దీంతో పిల్లలతోపాటు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకుంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో టెక్కలి, ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలతో నాడు–నేడు పథకం తొలి విడతలో పాఠశాలలు, కళాశాలలకు పక్కా భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణాలు జరిగాయి. రెండో విడతలో కూడా పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాటి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఆ తరువాత అధికారం చేపట్టిన కూటమి సర్కార్ వీటిపై కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు. అలాగే పెండింగ్ బిల్లులు చెల్లించని పరిస్థితి నెలకుంది.

–సాక్షి నెట్‌వర్క్



అసంపూర్తిగా నిలిచిపోయిన కంచిలి మండలం మఠంసరియాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల భవనం



కాశీబుగ్గ హైస్కూల్‌కు నిర్మించిన భవనం

కాశీబుగ్గ మున్సిపాలిటీలో రూ. 20 కోట్లతో నాడు-నేడు పనులు

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న నాలుగు మున్సిపల్ హైస్కూళ్లు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం ద్వారా రూ. 20 కోట్లతో అభివృద్ధి చేశారు.కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనే సుమారు రెండున్నర కోట్ల రూపాయలతో 20 తరగతి గదులను నిర్మించారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నాడు-నేడు పథకంతో అభివృద్ధి చేసిన పాఠశాలలు ఇవే..

మండలం	ఫేజ్–1	మంజూరైన నిధులు రూ. కోట్లలో	ఫేజ్–2	మంజూరైన నిధులు రూ.కోట్లలో
ఇచ్ఛాపురం	38	రూ. 14.93	55	రూ.18.51
కవిటి	28	రూ. 8.32	49	రూ. 22.86
కంచిలి	33	రూ. 7.18	42	రూ. 18.23
సోంపేట	29	రూ. 11.60	47	రూ. 20.34



వజ్రపుకొత్తూరు: దేవునల్తాడ పంచాయతీ సూర్యమణిపురం ప్రాథమిక పాఠశాల

పలాస నియోజకవర్గంలో..

పలాస మండలంలో 84 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 83 పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణం జరిగింది. ఇందులో 50 భవనాలు పూర్తయ్యాయి. 33 భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో బాలికల జూనియర్ కళాశాల కూడా ప్రారంభమైంది.



పలాస: బ్రాహ్మణతర్లా ఉన్నత పాఠశాలలో నిర్మించిన బాలికల టాయ్‌లెట్స్

బడులను దేవాలయాలుగా మార్చారు...

టెక్కలి నియోజకవర్గంలో ఒకప్పుడు శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో విద్యనభ్యసించేవారు. చిన్నపాటి చినుకు పడితే చాలు ఆ పాఠశాలకు సెలవులు ఇచ్చేసేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన ఆలోచనలతో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలు దేవాలయాలుగా మారాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అటువంటి కార్యక్రమాలపై దృష్టి సారించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలపై వివక్షత చూపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టెక్కలి నియోజకవర్గంలో 305 పాఠశాలల్లో సుమారు రూ. 64.37 కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేశారు.



టెక్కలి: సర్వాంగ సుందరంగా మారిన లింగాలవలస ప్రాథమిక పాఠశాల

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

కాశీబుగ్గ: పోరాటాల సారధి, కార్మిక వర్గ వేగుచుక్క సీఐటీయూ అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నెయ్యిల గణపతి అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏపీఎన్‌జీవో కార్యాలయం వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారంగా ఘనంగా నిర్వహించి మాట్లాడారు. 1970లో సీఐటీయూ ఆవిర్భవించిన నుంచి కార్మికులకు వెన్నుదన్నుగా నిలిచి వారి సమస్యలు పరిష్కారంలో అనేక విజయాలు సాధించిందని అన్నారు. కార్మికవర్గంతో పెనవేసుకుపోయి వారి హక్కుల పట్ల నిజాయితీగా, నిబద్ధతతో పని చేసే సంఘంగా సీఐటీయూ ఖ్యాతి గడించిందన్నారు. జూలై తొమ్మిదో తేదీన జరగబోయే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్మిక సంఘ నాయకులు సీహెచ్ మురగన్, ఎం.రవి, శకుంతల, గురువారి, పద్మ, సంతోష్, శేఖర్, టునా నాయక్, బర్ల గోపి, మోహన్ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

జగనన్న కాలనీని పరిశీలించిన అధికారులు

కంచిలి: మకరాంపురం గ్రామంలోని జగనన్న కాలనీని జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రత్యేక అధికారి పి. వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. సత్వరమే ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే పరిష్కరిస్తామన్నారు. హౌసింగ్ ఈఈలు నాగేశ్వరరావు, అప్పారావు, డీఈఈ సత్యాజీ, స్థానిక ఏఈ ఆర్.దిలీప్, ఎంపీడీవో వి.తిరుమలరావు ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వెంకటరమణ



ఆటోకు స్టిక్కర్ అతికిస్తున్న ఎస్సై ముకుందరావు

ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీలోని ఆటోలకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికించినట్టు పట్టణ ఎస్‌ఐ ముకుందరావు శుక్రవారం తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆటోల్లో ప్రయాణించే వారికి భద్రత కోసం వీటిని అతికిస్తున్నట్టు పేర్కొన్నారు. క్యూఆర్ కోడ్ స్టిక్కర్‌ను స్కాన్ చెస్తే ఆటో, డ్రైవర్ పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

నందిగాం: వచ్చే నెల నాలుగో తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పలువురు నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు ఒక్కటీ నెరవేర్చకుండా ఏడాది కాలం గడిపిన కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాన్ని వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన మొదటి ఏడాదిలోనే 99 శాతం హామీలు నెరవేర్చగా, ఇప్పుడు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలకు దగా చేసి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో ఎక్కడా అభివృద్ధి జాడలు కనిపించడం లేదన్నారు. జూన్ ఒకటో తేదీన టెక్కలి పార్టీ కార్యాలయంలో టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం పది గంటలకు నిర్వహించనున్న సమావేశానికి పార్టీ జిల్లా పార్లమెంట్ పరిశీలకుడు కుంబా రవిబాబు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాసు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త తమ్మినేని సీతారాం హాజరవుతారన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మతిరెే ఫాల్గుణరావు, నాయకులు జడ్యాడ జయరాం, చిన్ని జోగారావు, బొంగి హనుమంతురావు, రేగల కూర్మారావు, పోలాకి మోహనరావు, తమిరె రాజు, రోణంకి డిల్లేశ్వరరావు, బొమ్మాళి గున్నయ్య పాల్గొన్నారు.



నందిగాం: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

టెక్కలి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాలకు వెన్నుపోటు పొడిచి పెద్ద ఎత్తున మోసం చేశారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. దీనిపై జూన్ నాలుగో తేదీన ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమంతో కూటమి ప్రభుత్వానికి బుద్ధి రావాలని కోటబొమ్మాళి మండల నాయకులు అన్నారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడుస్తున్నప్పటికీ ఎన్నికల మునుపు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని గుర్తు చేశారు. నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒకటో తేదీన నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సమావేశానికి కోటబొమ్మాళి మండల నాయకులు హాజరు కావాలని కోరారు. కోటబొమ్మాళి మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, మండల సీనియర్ నాయకుడు రోణంకి ఉమా మల్లయ్య, కోటబొమ్మాళి సర్పంచ్ కె.సంజీవరావు, నాయకులు పేడాడ వెంకట్రావు ఉన్నారు.




టెక్కలి: కోటబొమ్మాళిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సారాతో ఒకరి అరెస్టు

మందస: సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. చిన్నకోష్ట గ్రామంలో సోంపేట ఎక్సైజ్, శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు చేశారు. ద్విచక్ర వాహనంపై 30 లీటర్ల సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తిని అదుపులోకి కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో సోంపేట ఎక్సైజ్ సీఐ జీవి రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రాజేశ్వరరావు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాల తరువాత ఒకేవేదికపై..

వజ్రపుకొత్తూరు రూరల్: స్నేహితులుగా 30 వసంతాలు పూర్తి చేసుకున్న వారంతా ఒకేచోటు కలుసుకున్నారు. మెట్టూరుకు చెందిన పలువురు 1995 నుంచి స్నేహితులుగా ఉంటున్నారు. 2025 నాటికి 30 వసంతాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో కలుసుకొని సందడి చేశారు. వీరిలో చాలా మంది దేశవిదేశాల్లో ఉద్యోగులుగా స్థిరపడిఉన్నారు. అయితే గ్రామంలో జరుగుతున్న కొండ మహంకాళి అమ్మ వారి సంబరాలకు వారంతా గ్రామానికి రావడంతో ఒకేచోట కలుసుకొని అప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు, గ్రామపెద్దలను ఘనంగా సత్కరించారు. మిత్ర బృందంలో వివిధ కారణాలతో మృతి చెందిన వారికి సంతాపం తెలియజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న స్నేహితులకు తోడ్పాటు అందించాలని నిర్ణయించుకున్నారు. అనంతరం కలియకకు గుర్తుగా జ్ఞాపికలు అందజేశారు.



ఒకేచోటు కలుసుకున్న స్నేహితులు



వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

సంతబొమ్మాళి మండలం నౌపడలో పద్మావతి వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయం కుంకుమ పూజలు, స్వామి వారి కల్యాణం, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం చిన్నారుల చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. –సంతబొమ్మాళి



వీరబ్రహ్మేంద్ర స్వామి తిరువీధి

నందిగాం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రతిష్టా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వామి వారి చిత్రపటానికి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్ర విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా మేళతాళాలతో తిరువీధి చేపట్టారు. –నందిగాం



పోలీసుల కార్డెన్ సెర్చ్

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని సంతపేట, జర్నలిస్ట్ కాలనీ సమీపంలో పట్టణ సీఐ మీసాల చిన్నంనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 125 ద్విచక్ర వాహనాలను పరిశీలించారు. వీటిలో 25 వాహనాలను స్టేషన్‌కి తరలించారు. అనంతరం వాహన యజమానులు సంబంధించిన పత్రాలను సమర్పించడంతో 21 వాహనాలను విడిచిపెట్టారు. ఎస్సైలు ముకుందరావు, శ్రీనివాసరావు, రవివర్మ పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం